క్లుప్తంగా...

బండమాదారం, రాజబొల్లారంలో నేడు కంటివెలుగు శిబిరాలు

మేడ్చల్: ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు మేడ్చల్ మండలం, గుండ్లపోచంపల్లి, మేడ్చల్ మున్సిపాలిటీలలో గురువారం ప్రారంభం కానుంది. మండలంలో బండమాదారం, రాజ బోల్లారం గ్రామాలలో మేడ్చల్ మున్సిపాలిటీలోని ఒకటవ వార్డులో ముకుంద్ ఫంక్షన్ హల్‌లో, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ ఓకటవ వార్డు సుతారిగూడలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

కీసర: ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని నాగారం మున్సిపాలిటీపరిధిలో టీడీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాగారం మున్సిపల్ ఛైర్మెన్ కౌకుట్లచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతికార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలవేసి మున్సిపల్‌ఛైర్మెన్ చంద్రారెడ్డి ఘనంగా నివాళులర్పించారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


చెరుకుపల్లి కాలనీలో కార్యకర్తలతో సమావేశమైన టీపీసీసీ ప్రతినిధి హన్మంతరెడ్డి

జగద్గిరిగుట్ట: కుత్బుల్లాపూర్ అసెంబ్లీలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ డివిజన్‌లోని చెరుకుపల్లి కాలనీలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలతో హన్మంతరెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లోని 49 బూత్‌ల స్థాయి కమిటీల ఎన్నికను పూర్తి చేసి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, నాయకులు సిద్దనోళ్ల సంజీవరెడ్డి, పండరిరావు, జేమ్స్, గణేష్, వీరేష్ గుప్తా, శివ, గొల్ల జాన్, డివిజన్ ఏ-బ్లాక్ సెక్రటరీ బాలయ్య, మాజీ వార్డ్ సభ్యులు ఆనందరావు, సిద్దయ్య, ప్రదీప్, దిలీప్‌గౌడ్, నర్సింహారెడ్డి, వనజ, సంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో మెరుగైన వసతులు కల్పిస్తున్నాం


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, ఆనంద్‌కుమార్

దుండిగల్: ప్రజలకు మెరుగైన వసతులు కల్పించే దిశగా ముందుకు సాగుతున్నామని దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. బుధవారం దుండిగల్ 5వ వార్డులో రూ.37 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ లైన్ పనులను ఆయన స్థానిక కౌన్సిలర్ ఆనంద్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ... వార్డులలో మెరుగైన వసతులు కల్పిస్తున్నామన్నారు. ప్రజా సమస్యలపై ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతూ ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బౌరంపేట పీఏసీఎస్ వైస్ చైర్మన్ నల్తూరి కృష్ణ, మాజీ సర్పంచ్‌లు కావలి గణేష్, కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ బండారి మహేష్, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు జక్కుల శ్రీనివాస్, కుంటి నాగరాజు, సుధాకర్‌రెడ్డి, ప్రేమకుమార్, శంకరయ్య, స్వామి, భిక్షపతి, దంతి మహేష్, నరేష్ యాదవ్ తదితరులు ఉన్నారు.

మతి స్థిమితం లేని వ్యక్తి అదృశ్యం

నిజాంపేట్: మతి స్థిమితం సరిగా లేని ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నిజాంపేట్‌కు చెందిన కోమలి జయరామ్(55) గతనెల 26న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అతని కోసం చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాని నేటికి అతని ఆచూకీ లభించకపోవడంతో జయరామ్ కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. పలు ప్రాంతాల్లో అతని ఫోటోతో కూడిన వాల్ పోస్టర్లను అంటించారు. అతనికి గత కొన్ని రోజులుగా మతి స్థిమితం సరిగా ఉండటం లేదని, ఆచూకీ తెలిస్తే ఫోన్ నం.9849461842 / 9705364888లో సంప్రదించాలని కోరుతున్నారు.

బ్లాక్ టికెట్లు విక్రయిస్తున్న నలుగురు అరెస్టు

ఉప్పల్: ఇండియా, న్యూజిలాండ్ మ్యాచ్‌ల మధ్య జరుగుతున్న వన్‌డే మ్యాచ్ టికెట్లను అధిక రేట్లకు బ్లాక్‌లో విక్రయిస్తున్న ఐదుగురు వ్యక్తులను ఉప్పల్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి దాదాపుగా 24 టికెట్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

పకడ్బందీగా సర్వే

- గ్రేటర్‌తోసహా శివారు జిల్లాలలో 31 వరకు విద్యాశాఖ సర్వే
- బడి బయట పిల్లలను తిరిగి చేర్పించేందుకు చర్యలు
- వివిధ కారణాలతో బడికి దూరమవుతున్న గ్రామీణ,పట్టణ పిల్లలు
- బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే ప్రభుత్వం లక్ష్యం
- గ్రామాలు,పురపాలక సంఘాలు,బస్తీల వారీగా ఆరా

సాక్షి,మేడ్చల్ జిల్లా: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు విద్యాశాఖ చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా బడి బయట, మధ్యలోనే చదువు మానేసిన పిల్లలను గుర్తించేందుకు గ్రేటర్ హైదరాబాద్‌తో సహా శివారు రంగారెడ్డి ,మేడ్చల్ జిల్లాలో సర్వే చేపడుతున్నారు. మూడు జిల్లాల్లో ఈ నెల 31 వరకు సర్వే చేపట్టేందుకు అధికారులు సీఆర్పీలు, ఐఈఆర్పీలను ఆదేశించారు. సర్వే చేయాల్సిన విధానంపై పలు దశల్లో జూమ్ మీటింగులు, సమావేశాలతో అవగాహన కల్పించారు. ఏటా 6 నుంచి 14 సంవత్సరాల లోపు పిల్లలను మాత్రమే గుర్తించేవారు. గతేడాది నుంచి 14 నుంచి 19 సంవత్సరాల మధ్య ఉన్నవారిని కూడా సర్వేలో భాగంగా గుర్తిస్తున్నారు.

గ్రేటర్‌తోసహా శివారుల్లో 2,498 సర్కారు బడులు

గేటర్‌తోసహా శివారు రంగారెడ్డి,మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలో మొత్తం 2,498 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, ఇందులో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 515, రంగారెడ్డి జిల్లాలో 1,301,హైదరాబాద్ జిల్లాలో 682 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. కొందరు ఆర్థిక పరిస్థితులు తదితర పలు కారణాలతో చదువుకు దూరంగా ఉంటున్నారు. మరి కొందరు తల్లిదండ్రులకు ఆసరాగా కోసం మధ్యలోనే చదువులను మానేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు అందుబాటులో లేకపోవటంతోపాటు సమీపంలో ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు చెల్లించలేక బడులకు దూరమవుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ,జీహెచ్ఎంసీ పరిధిలో విద్యాశాఖకు చెందిన ఐఈఆర్పీలు, సీఆర్పీలు పర్యటించి ఈ నెల 31లోగా క్షేత్రస్థాయి సర్వే నిర్వహించేందుకు రంగంలోకి దిగారు. ఈ నెల 6 నుంచి ఐఈఆర్పీలు,సీఆర్పీలు తమకు కేటాయించిన మండలాలు, పురపాలక సంఘాలు,బస్తీల పరిధిలో సర్వే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఈ సర్వేలో 28 అంశాలతోకూడిన సమాచారాన్ని కూడా సేకరిస్తున్నారు.సర్వేలో సేకరించిన వివరాలను ఈ నెల31 వరకు మండలస్థాయిలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. జిల్లా స్థాయిలలో మరోసారి సర్వే జాబితాను పరిశీలించి తప్పులను సవరించి ప్రభుత్వానికి నివేదిస్తారు. వివిధ కారణాల నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులతో చాలామంది బడిమానేసి పనులకు వెళ్తున్న పిల్లలు ఉన్నారు. సర్వే నామమాత్రంగా కాకుండా పకడ్బందీగా నిర్వహిస్తే బడి బయట పిల్లల సంఖ్య భారీగా పెరిగే అవకాశముంటుందని భావిస్తున్నారు.


గ్రామాలు ,పట్టణాల్లో సర్వే నిర్వహిస్తున్న విద్యాశాఖ ఉద్యోగులు తదితరులు

గుర్తించిన బడిబయట పిల్లలు ఇలా..

2020-21లో నిర్వహించిన సర్వేలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 294 మంది బడి బయట ఉన్నట్లు గుర్తించారు. ఇందులో 6-14 ఏళ్లలోపు 254 మంది పిల్లలు, 15-19 ఏళ్ల లోపు 40 మంది ఉన్నట్లు గుర్తించారు. 2021-22లో 247 మంది పిల్లలు బడి బయట ఉన్నట్లుగా గుర్తించిన విద్యాశాఖ ..ఇందులో 6-14 ఏళ్ల లోపు 238 మంది పిల్లలు, 14-19 ఏళ్ల లోపు 09 మంది ఉన్నారు. వీరికి ఆయా పాఠశాలలు, సార్వత్రిక విద్యాలయాల్లో ప్రవేశాలు కల్పించి చదువుకునేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే

ప్రభుత్వ ఆదేశాల మేరకు బడి బయట ఉన్న పిల్లలతోపాటు మధ్యలో బడి మానేసిన పిల్లల గుర్తింపునకు సర్వే చేపడుతున్నాం. ఇప్పటికే సంబంధిత సిబ్బందికి ఆదేశాలివ్వటంతోపాటు సర్వేకు సంబంధించి పలు సూచనలిచ్చాం. బడీడు పిల్లలు బడుల్లో ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది.

– ఐ.విజయకుమారి
జిల్లా విద్యాశాఖ అధికారి,మేడ్చల్ జిల్లా

దేశ భద్రతలో సీఆర్‌పీఎఫ్ జవాన్ల సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న ఎన్‌సీడీఈ చైర్మన్, ఐపీఎస్, ఐజీపీ మహేష్‌చంద్ర లడ్డా

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని సీఆర్‌పీఎఫ్‌లో దివ్యాంగ వారియర్ జవాన్లకు సీఎస్ఆర్ ద్వారా హీరో మోటో కార్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉచితంగా 16 వాహనాలను బుధవారం ఎన్‌సీడీఈ చైర్మన్, ఐపీఎస్, ఐజీపీ మహేష్ చంద్ర లడ్డా ముఖ్య అతిథిగా హాజరై అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ భద్రతలో సీఆర్‌పీఎఫ్ జవాన్ల సేవలు, ప్రాణాలు సైతం లెక్క చేయకుండా సీఆర్‌పీఎఫ్ జవాన్ల వీరోచిత పోరాటం మరువలేనివన్నారు. వారి కుటుంబాలను సైతం లెక్కచేయకుండా దేశ సేవలో నిమగ్నమవుతారన్నారు. యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్ల త్యాగాలు వృధాకావన్నారు. అనంతరం 16 మంది దివ్యాంగ వారియర్ జవాన్లకు ఉచితంగా రిట్రోఫిట్ చేయబడిన వాహనాలను హీరో మోటోకార్ప్స్ యాజమాన్యం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీఈ డైరెక్టర్, డీఐజీ జీసీ ఆర్‌ఆర్‌వై. అనిల్‌మింజ్, హీరో మోటో కార్స్ లిమిటెడ్ ఏఎస్ఎం వినీత్, సీఆర్‌పీఎఫ్ అధికారులు, దివ్యాంగ వారియర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి చేయూత

ఉప్పల్: ఉప్పల్‌కు చెందిన డ్రైవర్ నవీన్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబం పెద్ద దిక్కు కోల్పోయింది. ఉప్పల్ మాజీ కార్పొరేటర్ పోగులు సుగుణ దయాకర్‌రెడ్డి దంపతులు బుధవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బండారి లక్ష్మారెడ్డి చేతులమీదుగా రూ.75 వేల చెక్కును నవీన్ భార్యకు అందజేశారు. ఆపదలో ఉన్న పేద కుటుంబానికి పెద్దదిక్కుగా సాయం అందజేసిన పోగుల దయాకర్‌రెడ్డి దంపతులను లక్ష్మారెడ్డి అభినందించారు. మేకల మధుసూదన్ రెడ్డి, పోగుల ఎల్లారెడ్డి, పల్లె రాజ్‌కుమార్, విజయ్ కుమార్, పంగ రాజేశ్వర్‌రెడ్డి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

దుండిగల్ కమిషనర్‌గా సత్యనారాయణ

దుండిగల్: దుండిగల్ మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లు బదిలీ అయ్యారు. ఆయనను శంషాబాద్ మున్సిపాలిటీ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. భోగీశ్వర్లు స్థానంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సూపరింటెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న కె.సత్యనారాయణ దుండిగల్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టానున్నారు.

నర్సరీలను పరిశీలించిన అధికారులు

కీసర: గ్రామాల్లో నర్సరీల్లో పెంచుతున్న మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీఆర్‌డిఏ అధికారి పద్మజారాణి అన్నారు. బుధవారం మండలంలోని యాద్గార్‌పల్లి, తిమ్మాయిపల్లి తదితర గ్రామాల్లో పంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీలను ఆమే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నర్సరీలో వివిధ రకాల మొక్కల పెంపకం చేపట్టి హరితహారంలో భాగంగా మొక్కలను నాటేందుకు సిద్ధం చేయాలన్నారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. కార్యక్రమంలో గ్రామకార్యదర్శులు, బిల్‌కలెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


యాద్గార్‌పల్లి గ్రామంలో నర్సరీని పరిశీలిస్తున్న డిఆర్‌డిఏ అధికారి పద్మజారాణి

గాత్రంతో వాకిటి రామ్‌రెడ్డి మంత్రముగ్ధులను చేస్తారు

- నందిని సిధారెడ్డి

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్‌కు చెందిన మానస టూల్‌టెక్ అధినేత, ఆత్మీయ భారతి సాహిత్య సేవా సంస్థ అధ్యక్షుడు ఘన సన్మానం అందుకున్నారు. మంగళవారం రాత్రి నగరంలోని తెలంగాణ సారస్వత్ పరిషత్‌లో తెలంగాణ భాష సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో గంట జలంధర్‌రెడ్డి సంపాదకత్వంలో వెలువడిన దారిదీపాలు గ్రంథావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశిష్ట అతిథులుగా హాజరైన తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు నందిని సిద్దారెడ్డి, మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, జిరసం అధ్యక్షుడు పొరెడ్డి రంగయ్య తదితరులు వాకిటి రామ్‌రెడ్డి సాహిత్య, సామాజిక రంగంలో చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ మెమొంటో, శాలువతో సత్కరించి దారిదీపాలు పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నందిని సిధారెడ్డి మాట్లాడుతూ.. వాకిటి రామ్‌రెడ్డి జన చైతన్య పాటలు రాయడంలో పట్టుసాధించారని, తన గాత్రంతో సభికులను మంత్రముగ్ధులు చేస్తారని కొనియాడారు. ఈ కార్యక్రమములో ప్రముఖ కవి సుంకిరెడ్డి నారాయణరెడ్డి, ప్రజాభారతి కవులు ఎస్.ఎన్.చారి, ఉప్పలయ్య, రవీంద్రభారతి సేవకురాలు హేమలతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రామ్‌రెడ్డికి మెమొంటో అందజేస్తున్న తెలంగాణ భాష సాంస్కృతిక మండలి సభ్యులు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతదేహం లభ్యం

ఘట్‌కేసర్: యంనంపేట్‌లో బుధవారం అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన మేరకు..పోచారం మున్సిపాలిటీ యంనంపేట్ బొంతకుంట కాలువలో మృతదేహం పడి ఉందని పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు వెళ్లి పరిశీలించగా కుళ్లిన స్థితిలో ఓ వ్యక్తి మతదేహం లభ్యమైంది. అతడి కుడి చేతికి మణికంఠ సురేశ్ అని టాటూ ఉంది. కుంట సమీపంలో టీఎస్-08-జీఎఫ్-8820 నెంబర్ గ్లామర్ బైక్ ఉంది. విచారణలో ఉప్పల్, భరత్‌నగర్‌కు చెందిన ఎరుకుల సురేశ్(37) టిప్పర్ డ్రైవర్‌గా తేలింది. అతడు మద్యానికి బానిసయ్యాడని తెలిసింది. మృతదేహాన్ని పోస్టుమార్గం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న సర్పంచ్ మాధురి

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కీసర: ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు సీఎం రిలీఫ్‌ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని కీసర సర్పంచ్ మాధురి అన్నారు. బుధవారం కీసర గ్రామానికి చెందిన మహేశ్వరికి సీఎం రిలీఫ్‌ఫండ్ కింద మంజూరైన రూ.60 వేలకు సంబంధించిన చెక్కును బీఆర్ఎస్ మండలపార్టీ అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డితోకలిసి లబ్దిదారురాలికి అందజేసారు. ఉపసర్పంచ్ లక్ష్మన్. బీఆర్ఎస్ నేతలు, ప్రవీణ్, మంగమ్మ, శీలంలలిత, మల్లేష్, రాఘవేందర్‌గౌడ్, చినింగనిబాల్‌రాజ్, గణేష్, సుమన్‌బన్నీ, పరమేష్‌యాదవ్, వెంకటేష్, నరేందర్‌రెడ్డి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని 6వ డివిజన్ మల్లిఖార్జున్‌నగర్‌లో రూ.5 లక్షల వ్యయంతో నిర్మించే అంతర్గత డ్రైనేజీ పనులను బుధవారం కార్పొరేటర్ పల్లపు రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. డివిజన్ పరిధిలో సీసీ రోడ్లు, అంతర్గత డ్రైనేజీ, ఇంటింటికి మిషన్ భగీరథ నల్లాలు అందచేశామన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు జంగిటి రమేష్, మాజీ వార్డు సభ్యురాలు ఉపేంద్ర, మహిళ అధ్యక్షురాలు ధనలక్ష్మీ, యూత్ అధ్యక్షులు ప్రశాంత్ పాల్గొన్నారు.


పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పల్లపు రవి

కంటి వెలుగును విజయవంతం చేయాలి


కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా అదనపుకలెక్టర్ అభిషేక్ అగస్త్య, అధికారులు

ఘట్‌కేసర్ : కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య అన్నారు. కొండాపూర్ కమ్యూనిటీ హాల్లో కంటి వెలుగు రెండో విడత ఏర్పాట్లపై మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కమిషనర్ వేమనరెడ్డితో కలిసి బుధవారం ట్రయిల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తాగునీరు, శానిటేషన్ నిర్వహణ, మూత్రశాలల పరిశుభ్రత ఇతర ఏర్పాట్లపై దృష్టి సారించాలన్నారు. సిబ్బందికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఒకటో వార్డు కౌన్సిలర్ వెంకట్‌రెడ్డి, 8వ వార్డు కౌన్సిలర్ హేమలత గోపాల్‌రెడ్డి, ఏఈ నరేశ్, మేనేజర్ అంజిరెడ్డి, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్

కీసర: కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానికసంస్థలు) అభిషేక్ అగస్త్య అన్నారు. బుధవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో కంటివెలుగుకార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులతోపాటు, కంటి అద్దాలు అందజేస్తామన్నారు. కమిషనర్ వాణీరెడ్డి, వైద్యసిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు ఏర్పాట్ల పరిశీలన

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని యమ్నంపేట్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటి వెలుగు శిబిరాలు 19వ తేదీ నుంచి వంద రోజుల పాటు ప్రతి దినం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పనిచేస్తాయన్నారు.. కంటి పరీక్షలు చేయించుకోవడానికి వచ్చే ప్రజలకు కావాల్సిన వసతులు కల్పించడంలో ఎలాంటి లోపాలు ఉండకుండా చూడాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ సురేష్, కౌన్సిలర్లు గొంగళ్ల మహేష్, మేనేజర్ నర్సింహులు, ఏఈ నరేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్ర భవనం ప్రారంభం

మేడ్చల్: గౌడవెళ్లి గ్రామంలో శిధిలావస్థకు చేరిన ఆరోగ్య కేంద్ర భవనం ను నూతన భవనంలోకి మార్చి సర్పంచ్ సురెందర్‌ముదిరాజ్ నూతన భవణంను ప్రారంభించారు. ఈసంధర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఆరోగ్య ఉపకేంద్రాన్ని తాత్కాలిక భవనంలోకి మార్చామని త్వరలోనే పక్కా భవనం నిర్మిస్తామని అన్నారు. ఆరోగ్య ఉప కేంద్రంతో పాటు పశువైద్య శాలను తాత్కాలిక భవనంలోకి మార్చామని త్వరగా పశువైద్య శాలకు నూతన భవనం నిర్మిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పెంటమ్మ, వార్డు సభ్యులు సదానంద్‌గౌడ్, సుదర్శన్‌రెడ్డి,శివకుమార్, గణేష్, రాజుగౌడ్ , సుధాకర్, గోపాల్ మాజీ సర్పంచ్‌లు భగవాన్‌దాస్, జగన్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.


ఆరోగ్య ఉపకేంద్రం భవనాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

అనుమతిలేని వెంచర్లపై చర్యలు తీసుకోవాలి

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలంలోని కేశవరం గ్రామంలో చేపడుతున్న అనుమతిలేని వెంచర్లపై చర్యలు తీసుకోవాలని మండల కాంగ్రెస్ అధ్యక్షులు నర్సింహులు బుధవారం మేడ్చల్ జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. గ్రామంలోని 38,39 సర్వే నెంబర్లలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా వెంచర్ నెలకొల్పుతున్నారని, పక్కనే ఉన్న ప్రభుత్వ ఫారెస్ట్ స్థలాన్ని సైతం ఆక్రమిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో కాంగ్రెస్ నాయకులు హన్మంత్‌రెడ్డి, మహేందర్‌యాదవ్ తదితరులు ఉన్నారు.


డీపీఓకు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



అభివృద్ధి పనులు ప్రారంభం

శామీర్‌పేట్: మండలంలోని జగ్గంగూడ గ్రామంలో బుధవారం పలు అభివృద్ధి పనులను మూడుచింతలపల్లి ఎంపీపీ హారికమురళీగౌడ్, గ్రామ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డిలు ప్రారంభించారు. రూ.20లక్షల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు, అండర్ డ్రైనేజ్ పనులకు పూజలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాస్, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ఇదేం విచిత్రం.. మొక్కలకు మురుగు నీరు


ఎరిమల్లె వాగులోని మురికి నీటిని నింపుతున్న ట్యాంకర్


జాతీయ రహదారిపైనున్న మొక్కలకు మురికి పోస్తున్న ట్యాంకర్

ఘట్‌కేసర్: జాతీయ రహదారిపై పెంచుతున్న మొక్కలకు మురికి నీరు సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఘట్‌కేసర్ పట్టణంలోని బైపాస్ రోడ్డులో జాతీయ రహదారిపై రోడ్డుకు ఇరువైపులా పెంచుతున్న మొక్కలకు మంచి నీటికి బదులు మురికి నీటిని పోస్తూ ప్రజల సొమ్మును దోచుకుంటున్నారు. స్థానిక ఎరిమల్లె వాగులోకి చెరపల్లి ఇండస్ట్రియల్ కెమికల్ నీరు, మున్సిపాలిటీ డ్రైనేజీ నీరు కలుస్తుంది. రెండు కలిసి పారుతున్న ఎరిమల్లె వాగులోని నీటిని ట్యాంకర్‌కు బిగించిన మోటారు ద్వారా బైపాస్ రోడ్డులో సర్వీస్ రోడ్డు వద్ద ట్యాంకర్లు నింపి జాతీయ రహదారిపై పెంచుతున్న మొక్కలకు పోస్తున్నారు. దీంతో మొక్కల పెరుగుదలపై ప్రభావం చూపడమే కాకుండా ప్రజల సొమ్ము దుర్వినియోగం అవుతుందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి జాతీయ రహదారి మొక్కలకు మంచి నీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఢీకొట్టిన టిప్పర్

డ్రైవర్ పారిపోవడంతో టిప్పర్ యజమాని అరెస్టు

కుత్బుల్లాపూర్: వేగంగా వచ్చిన టిప్పర్ లారీ ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ ఆల్వాల్‌కు చెందిన ప్రణయ ఆంథోని బైక్‌పై మేడ్చల్ నుంచి వస్తుండగా కొంపల్లి ఫ్లైఓవర్ సమీపంలో వేగంగా వచ్చిన టిప్పర్ లారీ (టీఎస్ 35 టీ 1889) ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రణయఆంథోని కూడి చేయి విరిగింది. దీంతో సమాచారం అందుకున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్ ప్రవీణ్ పారిపోవడంతో టిప్పర్ నంబరు ఆధారంగా యజమానిని పోలీసులు అరెస్టు చేశారు. ఓ వ్యక్తిని ఢీకొట్టి గాయపర్చడమే కాకుండా, టిప్పర్ నంబర్ ప్లేట్‌పై నంబర్లు సక్రమంగా లేకపోవడంతో వివిధ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.